# జడుసుకున్న జవరాలు

(కథానిక)

ఉమా దేవి

సంక్రాంతినాటి సాయంత్రం. డాబామీద కూర్చున్నాము నేనూ రవీ, ఏవో కులాసా కబుర్లు చెప్పుకుంటూ... రాబోయే వేసవి సెలవులు ఎక్కడ గడపాలా అనే విషయంలో వాదోపవాదాలు జరుగుతున్నాయి... మెట్లమీద బూట్ల చప్పుడు వినిపించి రవికి కాస్త దూరంగా జరిగి కూర్చున్నాను. "రావచ్చా" అంటూనే దినేష్ పైకి అడుగు పెట్టాడు.

"గుడీవినింగ్ గురుదేవ్" అంటూ వచ్చిన శిష్యుణ్ణి రవి సాదరంగా ఆహ్వానించాడు. దినేష్ రవీవాళ్ళ కాలేజీలో మూడవసంవత్సరం యింజనీరింగ్ చదువుతున్నాడు. రవి అంటే తగని అభిమానం. ఒకవిధంగా హీరోవర్షిప్ చేస్తున్నాడనుకోవచ్చు. రవి తెలివితేటలమీద అపారమైన విశ్వాసం, ఉన్నతమైన అభిప్రాయం, విపరీతమైన గౌరవం అతడికి ఉన్నాయి. దినేష్ బెంగాలీ వాడయినా చక్కని తెలుగుమాట్లాడతాడు. తెలుగువాళ్ళంటే ఎంతో అభిమానం ఆప్యాయతా కనపరుస్తాడు. రవికోసం అప్పుడప్పుడువస్తూ తనతో పాఠ్య విషయాలకు సంబంధించినవే కాకుండా యితర విశేషాలూ, అంతర్జాతీయ రాజకీయాలూ చర్చిస్తూ ఉంటాడు. మరో రహస్యమేమంటే రవికి అతడు ఫేవరిట్ స్టూడెంటు.

గురుశిష్యులు గనక కబుర్లలో కూర్చుంటే కాలగమనాన్ని కూడా గమనించరు. రాత్రి ఏ పదో అయాక ఇక ఉండలేక "దినేష్- యీపూట నువ్వు మా యింట్లోనే భోజనం చేద్దువుగాని రా" అంటాను నేను. అప్పటికి తెలుస్తుంది వాళ్ళకి భోజనాలవేళకూడా దాటిపోయింది కాబోలని.

కంగారుగా "వద్దు మేమ్‌సాబ్—యింటికివెళ్తాను- మా అమ్మా వాళ్ళూ నాకోసం చూస్తూ ఉంటారు. గుడ్‌నైట్ గురూజీ—గుడ్‌నైట్ మేమ్" అంటూనే గడప దాటుతాడు దినేష్.

ఆనాడూ మామూలుగానే మాట్లాడుతూ "గురుదేవ్! నిన్నటి మీటింగులో మీ స్పీచ్ అమోఘంగా ఉందండీ. మిగిలిన ప్రొఫెసర్లంతా మీరు కాలేజీలో చదువుతున్నప్పటినుంచీ అద్భుతంగా మాట్లాడేవారని చెప్పారేగాని యింత గొప్పగా మాట్లాడతారని నేనెన్నడూ ఊహించలేదండీ! అంత డ్రై సబ్జక్టుమీద అంత యింటరెస్టింగ్‌గా మాట్లాడగలిగారు!... ఆ భావాలూ... అనర్గళమైన ఆ శైలీ... ఏక్సెంట్... ఆ విరుపులూ—అబ్బ—"

"ఊహు- అంత గొప్పగా ఉన్నాయా దినేష్!" అన్నాను-నవ్వుతూ, రవివైపు వాలుగా చూస్తూ.

ఈ పొగడ్తకు రవి చాలా యిబ్బంది పడిపోతున్నాడు - పొగడ్తలంటే ఎవరికైనా కాస్త మోజుఉండకపోదుగాని యింత పెద్ద మోతాదులో పొగడ్త రవి భరించలేడు! ఐతే దినేష్ యిదేదీ గమనించటంలేదు. అతడు చాలా సిన్సియర్‌గా మెచ్చుకుంటున్నాడు.

"నిజంగానే మేంసాబ్... గురూజీ పేరుకి మాత్రమే కాదు. తప్పకుండా గురుదేవులంతవారైతీరుతారు... ఒక్కటి మినహా అన్ని లక్షణాలూ ఉన్నాయి వారివి."

"ఏమిటో ఆ లోపించింది?" అన్నాను ఔత్సుక్యం పట్టలేక.

"ఆ మరేమీ లేదుగాని...గడ్డమే" అన్నాడు సందేహిస్తూ—జంకుతూ.

"ఓస్- అదెంత భాగ్యంలే...యిప్పటినుంచీ పెంచడం మొదలెడితే—" ఒక్కసారి తలెత్తాడు రవి. నేను అర్థోక్తిలోనే ఆగిపోయాను...ఏనాటి సన్నివేశాలో యిద్దరి స్మృతిపథంలోనూ మెరిశాయి. ఒకరికన్నులో ఒకరికి ఏవో తమాషాలు స్ఫురించాయి. అంతే! ఒక్కసారి శ్రుతికలిపి హాయిగా నవ్వుకున్నాము... దినేష్‌కూడా మా

నవ్వులో పాలుపంచుకున్నాడుకాని ఆ నవ్వుకు మూలం ఆ కుర్రాడికేం తెలుసు!...

* * *

నేను యఫ్. యల్. చదువుతున్నానప్పుడు. రవి యింజనీరింగు మూడో సంవత్సరం చదువుతుండేవాడా రోజుల్లో. ఆ ఏడు నా పుట్టినరోజునాడు రవిదగ్గర్నుంచి పార్సెల్ వచ్చింది. చక్కని గులాబీ పూల గ్రీటింగ్ కార్డూ, రెండు బొమ్మలూ, ఓ అందమైన ఫోటో (మరెవరిదో కాదు—తనదే!) అవీను. కాని ఆ ఫోటో చూచి ఆశ్చర్యపోయాను-నేనేకాదు నా స్నేహితురాళ్ళుకూడా ఆశ్చర్యపడి పైపెచ్చు నన్నేడిపించడం సాగించారు. కారణం ఏమంటే మేము ఎరుగున్న చిన్నారి చిలిపి రవి మొహం బదులు ఓ హుందా అయిన పెద్దకారు వ్యక్తి గంభీరమైన ముఖం కనిపిస్తోంది అందులో—విశేషం ఏమా అని పరికించి చూతుముగదా పెద్ద పెద్ద మీసాలు ఉంచుకున్నాడు! ఎప్పుడూ అతనలా మీసాలు ఉంచుకోవటం చూసి ఎరగం. అందుకని తమాషాగా ఉండి నవ్వొచ్చింది. ఇక "మీసాలాయన" అంటూ ఒకరు—

"అదేమిటి రాధా—మీవాడు అంతచేటు మీసాలు పెంచుకున్నాడు! ఇక మీయింట్లో రోజూ సంపెంగ నూనెల వాసనలే కాబోలు"—అని మంజూ—

"మీసాలమీద నిమ్మకాయలు నిలుపుతాడు కాబోలోయ్" అని ఇందిరా—నన్ను ఉడికించటం మొదలెట్టారు. ఒళ్ళు పొగరు కాకపోతే వీళ్ళ కెందుకో తనసంగతి అనిపిస్తుంది యిప్పుడు... కాని అప్పట్లో మాత్రం నాకే మీసాలున్నట్లూ వాళ్ళంతా నన్నే హేళనచేస్తున్నట్లు భావించి బాధపడేదాన్ని.

"ఏమే రాధా—ఎలా భరిస్తావే ఆ మీసాలను చూస్తూ...తీసెయ్యమని రాద్దూ" అని చెవినిల్లు కట్టుకుని పోరటం ప్రారంభించారు. ఇహ పట్టలేక రవికిరాశాను ఒకరోజు...యిలా అంతా నవ్వుతున్నారని—అంతంలేసి మీసాలు తీసెయ్యకూడదా అని సూచిస్తూ...

అబ్బ—రవి వట్టి పెంకెమనిషి! తనంటే నాకు ఎంత ఆత్మీయతో అంత భయం! ఒకళ్ళమాట వినే రకం కాదుగదా తను. అంతా తనమాటే వినాలి. భయపడుతూనే రాశాను—అనుకున్నట్లే జవాబు రానేవచ్చింది...

"ఏం రాధా రాణీ...నా మీసాల జోలి నీ ఫ్రెండ్సు కెందుకు? నా సరదాకొద్దీ నేను పెంచుకుంటున్నాను. మధ్య మీకేం బాధ?...ఇక్కడ—నా ఫ్రెండ్సు—ఆఖరికి మా ప్రొఫెసర్సుకూడా—"భరించలేం మహాశయా! ఆ మీసాలు ఉపసంహరించుకో" అంటున్నా నేను లక్ష్యపెట్టలేదు. ఒక ప్రొఫెసరయితే 'సికోచక్కని షేవింగ్ సెట్ ప్రెజెంట్ చేస్తా రవీందర్. దయచేసి ఆమీసాలు తీసెయ్యి ఎలాగైనా"—అన్నారు!...ఈసారిగనక మీవాళ్ళు నామీసాల మాట ఎత్తారంటే యిక మీదట గడ్డంకూడా పెంచుకుంటున్నానని చెప్పు" అంటూ వ్రాసుకొచ్చాడు. నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. భగవంతుడా మీసాలతోటే చూడటానికి భరించలేక పోతుంటే పైగా గడ్డంకూడానా — ఏనాటి పాపఫలమో ఇది అనిపించింది...అన్నిటికంటె బాధ దేనికి కలిగిందంటే నామాట నెగ్గించుకోలేక పోయానుకదా అని—నా స్నేహితురాండ్ర ముందు నా అహం దెబ్బతింది...లలిత మాత్రం... "అలా మీసాలు పెంచుకోటం లేటెస్టుఫేషన్ తెలివితక్కువ మొద్దూ! ఫ్రెంచి కటింగ్ వ్యాపించలేదూ? అలాగే యిదీ!" అని చాటుగా సముదాయించింది. నేను మాత్రం గడ్డంతో ఉన్న రవి ముఖాన్ని ఊహించుకోలేక బాధపడుతున్నాను...

రోజులు గడిచి పోతూనే ఉన్నాయి...రవి మాచ్ ఖండ్ లో ప్రాక్టికల్ ట్రైనింగుకు వెళ్ళాడు. నేను క్రిస్‌మస్ సెలవలకు యింటికివచ్చాను...

* * *

ఆనాడు వచ్చిన టెలిగ్రాం నా హృదయాన్ని ఆనందంలో ముంచి తేల్చింది...తను వస్తున్నాడు! ఇంత కాలానికి కలుసుకో గలుగుతున్నామంటే ఆ ఆనందాన్ని వర్ణించటానికి మాటలు చాలటం లేదు. ఇల్లంతా సర్దుతున్నాను—ఒకటే పనిగా అలంకరిస్తున్నాను...ఏమిటో ఆ కంగారు! ఇంకా పదిగంటల వ్యవధి ఉంది; పగలు తలంటి పోసుకున్నాను...గులాబీ రంగు అంటే తనకు విపరీత

మైన ప్రీతి...అందుకని ఆయన కోరిక ప్రకారం గులాబీ అమెరికన్ షిఫాన్ చీరె కట్టుకుని నల్ల వెల్వెట్ బ్లౌజు తొడుక్కున్నాను...యీ సింగారంలో రైలు టైమవటంగూడా గమనించలేదు కాని యింతహడావుడిలోనూ ఎర్రగులాబీలు తలలో పెట్టుకోవటం మాత్రం మరచిపోలేదు.

స్టేషనులోకి వెళ్ళేసరికే రైలు వచ్చేసింది... కంగారుగా ప్లాటుఫారంమీద ఒక చివరనుంచి మరో చివరకు రైలువైపు చూస్తూ నడుస్తున్నాను. "ఆగండి మేడమ్" అన్నారెవరో ఎదురుగుండా—గబుక్కున ఆగిపోయి తలెత్తి చూద్దునుగదా ఓ గడ్డాల ఆసామీ ప్రత్యక్షం! ఇంకొంచెం స్తిమితంగా చూచాకగాని ఆ మందహాసం చేస్తూ నిలుచున్న వ్యక్తి శ్రీవారేనని పోల్చుకోలేక పోయాను! "ఇక పద" అంటూ స్టేషనుబైటికి దోవతీశాడు బండిలో. దోవపొడుగునా ఒక్కమాటన్నా మాట్లాడలేదు నేను.

ఇంటికి వచ్చాక స్నానం, భోజనం మొదలైన కార్యక్రమమంతా సవ్యంగానే ముగిసింది. పెరట్లో జాజిపందిరిదగ్గర తనకు పక్క ఏర్పాటు చేయబడింది.

ఎదురుగుండా వాలుకుర్చీతో కూర్చున్నాను నేను. చాలాసేపు మౌనం ఆవరించింది యిద్దరి మధ్యా...మనసులో ఏవేవో ఉన్నాయి...కాని మాటలు రాందే!

చివరకి తనే—

"ఏం రాధా! చాలా ఉదాసీనంగా ఉన్నావు? ఇంతకాలంనుంచీ రాలేదని కోపమా?" అన్నాడు నా చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ.

అది కోపమో-దిగులో-కంగారో చెప్పేస్థితిలో ఉంటేగా నేను! స్టేషనులో అతన్ని చూడగానే షాక్ తిన్నట్లయింది నా పని!

"నావైపు చూడవూ, అలా ఎంతసేపు తల వంచుకుని కూర్చుందామని?" అంటూ ముఖం పైకెత్తాడు. పారిజాతాల జల్లులా వెన్నెల వెల్లువ నా ముఖాన పడుతోంటే నాకు మరింత సిగ్గేసింది.

"వెన్నెల వెలుగులో నీ ముఖంలో అప్సరసల అందం కనిపిస్తుంది రాణీ! అందుకే కావాలని వెన్నెల రోజుల్లో వచ్చాను. పండువెన్నెల్లో నీ పక్కన కూర్చుని కబుర్లు చెప్పాలని ఎంత కాలంనుంచో కలలు కంటున్నాను-యీ నాటికి నా స్వప్నం యథార్థమైనది" అంటున్నాడు. ఎంకి పాటలు జ్ఞాపకం వచ్చాయి నాకు.

"ఇంజనీరుగారు కవిగారైపోయేలా వున్నారే" అందా మనిపించింది. సామాన్యమైన నా ముఖమే యింత అందంగా కనిపిస్తోందంటుంటే అసలే అందమైన తన ముఖం ఆ చంద్రకాంతిలో యింకెంత శోభాయమానంగా ఉంటుందో చూడాలని కోరిక కలిగింది నాకు. సిగ్గుతో బరువెక్కిన కనురెప్పలను కంగారుగానే పైకెత్తాను. ఏం లాభం! కళ్ళూ, నుదురూ ముక్కూ తప్ప సగానికిపైగా ముఖం కనిపిస్తేగా! మహర్షిలాగా ఆ గడ్డమేమిటో కర్మ కాకపోతే! పూర్వం ఋషిపత్నులెలా భరించేవారో ఆ గడ్డాలరాయుళ్ళను! పోనీ వాళ్ళంటే చిన్నప్పుడే చేసుకున్నా రనుకుందాం-మరి ఆ మేనక యెలా వరించిందట ఆ విశ్వామిత్రుణ్ణి! ఈయన విశ్వామిత్రుడి తాత గదా కోపంలో! అప్పుడు మీసాలు గురించి రాసినందుకే కోపం వచ్చిందాయె, యిక గడ్డం మాటెత్తితే యింట్లోంచే పారిపోడూ!

నిండా యిరవై రెండేళ్ళయినా లేని తను ముప్ఫయియేళ్ళ పైబడ్డ వాడిలా కనిపిస్తున్నాడు ఆ గడ్డంతో-పచ్చని ఆ బుగ్గలు చూసే యోగ్యత మరి లేదు కాబోలు నాకు. ఈ ఆలోచన నాకు వచ్చేసరికి దుఃఖం పొర్లుకొచ్చింది. "రాధా! ఏమిటీ యీ మౌనం? నేను భరించలేను బాబూ, మాట్లాడవూ" అని గోముగా పిలిచాడు.

నాకూ మాట్లాడాలనే వుంది. కాని ఎలా, ఏం మాట్లాడాలి? ఏం తలుచుకున్నా ముందు గడ్డమే కనిపిస్తోంది. ఎలాగో తలెత్తి నాకు ప్రియతమమైన ఆ నల్లని కళ్ళల్లోకి సూటిగా చూడలేక పోయినా ఒక్కసారి చూడటానికి ప్రయత్నిద్దామంటే ముందు యిది భీకరంగా కనిపిస్తోంది. నున్నగా వెన్నెట్లో మెరిసిపోతూ శిల్పంలా మెత్తగాఉండే ఆ ముఖాన్ని ఒక్కసారి స్పృశిద్దామంటే...అదుగో! ఇంకెలా? ఏం చేయటానికీ నా కెలా సాధ్యమవుతుంది? రానురాను ఆ గడ్డం పెరిగిపోయి ప్రపంచాన్నంతటినీ ముంచివేస్తున్నట్లు తోచింది!

భావోద్వేగంతో హృదయం బరువెక్కింది, మాటలు రావటంలేదు. అలాగే దీనంగా తనవైపు చూచాను. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తను గాబరాపడుతూ నన్ను తన చేతుల్లోకి తీసుకుంటూ లాలనగా,

"ఏం రాధా, ఎందుకా కన్నీరు? నీ కన్నీటిని నేను చూచి సహించగలననే అనుకుంటున్నావా? ఇంతదూరంనుంచీ వచ్చింది నిన్ను ఏడిపించటానికా! ఏమిటి నీ బాధ, నాతో చెప్పు!"అంటూ దగ్గరగా ముఖం చేర్చబోతున్నాడు.

అమ్మో! నేను భయపడుతున్న క్షణం రానే వచ్చింది. కంగారుగా తన చేతుల్లోంచి విడిపించుకోటానికి ప్రయత్నిస్తూ "ఏమీ లేదు. ఊరికేనే—అంటే—"అంటూ అర్థంలేని పలుకులు పలికి ముఖం పక్కకు తిప్పుకున్నాను.

ఈమాటకు తన కంఠస్వరం తీవ్రమయింది, దెబ్బ తిన్నవాడిలా "నా రాక నీకు ఆనందం కలిగిస్తుందనుకున్నా గాని దుఃఖాన్నీ, బాధనీ తెచ్చిపెడుతుందనుకో లేదు. అదే తెలిస్తే యింతదూరం, ఛీఫ్ సెలవు యివ్వకపోయినా దెబ్బలాడి మరీ రాకేపోదును. ఈమాత్రానికేనా నిన్ను చూడకపోతే నిలవలేను అనుక్షణమూ నీకోసం కలవరిస్తూ నీ రాక కెదురుచూస్తున్నానంటూ ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపించావు?"అంటూ కోపంగా మంచం మీదకు వెళ్ళి అటుతిరిగి పడుకున్నాడు.

ఇంకేంచేయను—నా బాధ తనకు అర్థంకాదు. ఎలా వివరించి చెప్పాలి? చెప్పకపోతే అపార్థం చేసుకుని తనూ బాధపడుతున్నాడు—అది చూచి నేనుమటుకు సహించగలనా! తనకోసం నేను ప్రతీక్షించింది అబద్ధమా? అనుక్షణమూ తన సాన్నిధ్యం కోసం అలమటించింది అబద్ధమా? తన స్పర్శలో స్వర్గసుఖం పొందాలని ఎదురుతెన్నులు చూచింది మటుకూ అబద్ధమా? —కాని నేననుకున్నదేమిటి—తను చేసిన పనేమిటి? వీటన్నిటికీ మూలం... అదేగా...తన ముఖం అలా సగం కప్పుకునిపోతే చూడలేకపోతున్నాను. ఆ మాట పైకి ఎలా అనేది? తను అలా బాధపడుతోంటే నా హృదయం క్షోభతో మరీ కుమిలిపోతోంది.

తనపక్కగా వెళ్ళి కూర్చుని "రవీ!...అదికాదు నా మనసులో విషయం...నువ్వు రావటంవల్ల నిజంగా నాకు ఆనందమే కలిగింది. నా ఉత్తరాలలో అసత్యమేదీలేదు. నన్ను నమ్మవూ"—అంటూ భుజాలుపట్టుకుని బ్రతిమాలుతూ యిటువైపు తిప్పుకున్నాను.

"మరి విషయమేమిటి రాణీ—దాచకుండా చెప్పు"అన్నాడు కాస్త కోపం తగ్గి మృదువుగా—నా జడకు వేసిన రిబ్బను సవరిస్తూ... రెండో జడను సర్దుకుంటూ అప్పటికీ అసలు విషయం ఎలా బైట పెట్టాలో తెలీక తికమకపడుతూనే—

"మరి...మరి...నాకు భయమేస్తోంది నీవంక చూస్తోంటే" అన్నాను మెల్లిగా.

"నేనేం దయ్యాన్నా, రాక్షసుణ్ణా ..నన్ను చూసి భయమెందుకూ...?" అన్నాడు తను విస్తుబోతూ.

మళ్ళా మొదటికొస్తుందేమో వ్యవహారం అని భయపడుతూ—

"అదే...నీ గడ్డంచూస్తే"అని చిన్నపిల్లాలాగా బావురుమంటూ దిండుమీద వాలిపోయాను! దేనికైనా పసిపిల్లలే నయం—హాయిగా మనసులో ఉన్నదేదో పైకి అనేస్తారు. పెద్దవాళ్ళం అన్నీ ఆలోచనలే! అనుమానాలే!

ఈ మాట వింటూనే హృదయం తేలికపడేలా నవ్వేసాడు రవి.

"ఓహ్...యీ భాగ్యానికేటోయ్ యింత కంగారుపెట్టావు నన్ను! భలేదానివే రాణీ"అంటూ దగ్గరగా తీసుకున్నాడు ప్రేమతో.

* * *

ఎప్పుడూ తెల్లారి పదిగంటలయినా లేవని వ్యక్తి మర్నాటి ఉదయం ఆరింటికల్లా లేచి కూర్చుని షేవ్ చేసుకుంటూ విధేయుడిలా "గడ్డమేనా, లేక మీసాలుకూడా తీసేసుకోవాలా?"అని అడిగాడు. అక్కడికి తను మహా నా ఆజ్ఞానువర్తి అయినట్లు.

సిగ్గుతో—నా మాట నెగ్గిందన్న సంతోషంతో "నీ యిష్టం బాబూ నాకేమీ తెలీదు"అంటూ కాఫీ అక్కడపెట్టి వచ్చేస్తుంటే—

"పిచ్చి గాభరాపెట్టటం తెలుసు పాపం—లేడీ ఎడ్వొకేట్ గారికి"అన్నాడు.

నాటినుంచీ నేటివరకూ గడ్డంపెంచుకునే మాట మళ్ళీ ఎత్తలేదు మానవుడు. ★